క్లుప్తంగా

తిరువూరు డిపో తనిఖీ



తిరువూరు: రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఇంజినీరింగ్ విభాగ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చెంగల్‌రెడ్డి తిరువూరు ఆర్టీసీ డిపోను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్యారేజీలో బస్సుల మరమ్మతులు, విడిభాగాల సరఫరా, బస్సుల కండీషన్ తదితర అంశాలను పరిశీలించారు. బస్సులను పరిశుభ్రంగా ఉంచాలని, ప్రయాణికుల ఫిర్యాదులను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని డిపో మేనేజరు సుబ్రహ్మణ్యంను ఆదేశించారు. అనంతరం బస్టాండు ఆవరణలో మొక్క నాటారు. ఈసందర్భంగా కార్మికసంఘాల ప్రతినిధులు తమ సమస్యలను ఈడీకి వివరించారు.

వారాహి నవరాత్రులు

మైలవరం: మైలవరం కోట వెనుక ద్వారకా తిరుమల దత్తత దేవాలయం, కోట మహాలక్ష్మి దేవాలయంలో వారాహి నవరాత్రి ఉత్సవాలను మహిళలు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు అధికసంఖ్యలో పాల్గొని లలిత సహస్రనామ పారాయణ, వారాహి పూజలు చేశారు. ఆదివారం ఉదయం 9.30 గంటలకు శ్రీవేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో తొలి ఏకాదశి సందర్భంగా సామూహిక భగవద్గీత పారాయణ జరుగుతుందని నిర్వాహకులు వీ.బాలాజీప్రసాద్ తెలిపారు.

ఘనంగా రాజా వెంకట పాపయ్యరావు జయంతి

మైలవరం: మైలవరం రెండవ రాజా, బాల భారతి నాట్యమండలి వ్యవస్థాపకులు రాజా సూరానేని వెంకటపాపయ్యరావు జమీందార్ జయంతిని మైలవరం దివాణంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మైలవరం జమీందారు ఎస్వీ సుధాకరరావు తనయుడు, బాలభారతి నాట్య మండలి అధ్యక్షులు సూరానేని వెంకటనారాయణ నివృతరావు మాట్లాడుతూ మహనీయులు పాపయ్యారావు జమీందార్ నాడు ఎంతోమంది కళాకారులను పోషించి, కళాపోషణ కోసం తన యావదాస్తిని అర్పించారన్నారు. అలనాటి నాటక, సినీ కళాకారులు కన్నాంబ, వేమూరి గగ్గయ్య, చదలవాడ కుటుంబరావు, పారుపల్లి సుబ్బారావు, రుష్యేంద్రమణి, వంటి కళాకారులు, వాయిద్య కళాకారులు, రచయితలను ప్రోత్సహించడం ద్వారా కళామతల్లికి పాపయ్యారావు జమీందారు ఎనలేని సేవలందించారని కొనియాడారు.

ఉపాధ్యాయులపై ఒత్తిడి తగదు : పీఆర్టీయూ

మైలవరం: ఈ విద్యాసంవత్సరం ఉపాధ్యాయులపై ఒత్తిడి పెరిగిందని పీఆర్‌టీయూ మైలవరం మండల శాఖ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు పీ.గోపాల్, ఎం.వెంకటేశ్ తెలిపారు. స్థానిక పీఆర్‌టీయూ కార్యాలయంలో శనివారం గోపాల్ మాట్లాడుతూ ఓవైపు ఎన్‌రోల్‌మెంట్ కోసం బాధపడుతున్న ఉపాధ్యాయులకు, హాజరు విషయంలో గ్రేస్ పీరియడ్ లేకపోవడం, ఆన్‌లైన్ నమోదు తదితర పనులు ఇబ్బందిగా మారాయన్నారు. చిన్నచిన్న విషయాలలో అధికారులు అనాలోచితంగా వ్యవహరించడం ఆందోళనకరంగా ఉందని గోపాల్ పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారికి ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలని కోరారు.

దివ్యాంగులకు అన్నదానం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లిలోని దివ్యాంగుల సేవా సంస్థలో లయన్స్ క్లబ్ ఆఫ్ కొండపల్లి ఇండస్ట్రియల్ పార్క్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. క్లబ్ సభ్యురాలు దండా శ్రావణిరెడ్డి దాతృత్వంలో అన్నదానం చేశారు. ప్రతిఒక్కరూ దివ్యాంగులను ఆదుకునేందుకు తోడ్పడాలని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రేగళ్ల రఘునాథరెడ్డి తెలిపారు. కార్యదర్శి సురేష్, డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్లు బి.కృష్ణారెడ్డి, ఎన్‌బీఆర్ చౌదరి, సీహెచ్ వెంకటేశ్వరరావు, నాగిరెడ్డి, రామిరెడ్డి, సంస్థ ప్రతినిధి దివ్య పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించండి: డీపీవో



జూపూడి(ఇబ్రహీంపట్నం): గ్రామాల అభివృద్ధిపై అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి లావణ్యకుమారి సూచించారు. మండలంలోని జూపూడి గ్రామంలో శనివారం ఆమె పర్యటించారు. ఈసందర్భంగా చెత్త నుంచి వర్మి కంపోస్ట్ తయారీ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఇంటింటి నుంచి తడి పొడి చెత్త సేకరణపై ఆరా తీశారు. పారిశుద్ధ్య పనులు, తాగునీటి సరఫరా, ట్యాంకులు శుభ్రం చేయడంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పారిశుద్ధ్యం నిర్వాహణపై స్థానికులు అభిప్రాయాలు తెలుసుకున్నారు. వర్షాకాలంలో తాగునీటి క్లోరినేషన్‌పై తగిన శ్రద్ధ తీసుకోవాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భారీగా అప్పులు చేసి అదృశ్యం

- రూ.1.5కోట్ల వరకు జనానికి బాకీ..
- చిట్టీల పేరుతో సైతం దండుకున్న వైనం
- గంగినేని గ్రామంలో వెలుగుచూసిన ఘటన
- లబోదిబోమంటున్న బాధితులు

జి.కొండూరు: పొరుగు గ్రామం నుంచి వచ్చి పదేళ్లుగా నివాసం ఉంటూ గ్రామస్తులను నమ్మించి అప్పులు తీసుకున్న ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన జి.కొండూరు మండల పరిధి గంగినేని గ్రామంలో వెలుగు చూసింది. వివరాలలోకి వెళ్తే...జి.కొండూరు మండల పరిధి దుగ్గిరాలపాడు గ్రామానికి చెందిన ఇందుర్తి సత్యనారాయణ పదేళ్ల కిందట గంగినేని గ్రామానికి వచ్చి టైలరింగ్ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. భార్య మృతిచెందగా, ముగ్గురు కుమారులు ఉన్నారు. వీరిలో ఇద్దరు కుమారులు హైదరాబాద్‌లో ఉద్యోగాలు చేస్తుండగా మరో కుమారుడు తండ్రికి తోడుగా గంగినేని గ్రామంలోనే నివాసం ఉంటూ ఇటీవల గ్రామం నుంచి వెళ్లిపోయాడు. ఇదిలా ఉంటే సత్యనారాయణ గంగినేని గ్రామంలో టైలరింగ్, చిట్టీల వ్యాపారంతోపాటు హార్డ్‌వేర్ షాపును నిర్వహిస్తూ గ్రామస్తులతో నమ్మకంగా ఉండేవాడు. ఈ క్రమంలో గ్రామస్తుల నుంచి కొంతకాలంగా ఒకరికి తెలియకుండా మరొకరి దగ్గర అప్పులు చేశాడు. గంగినేని గ్రామంలో 70మందితోపాటు దుగ్గిరాలపాడు, కొత్తపాలెం, సున్నంపాడు గ్రామాల్లో మరి కొంతమంది, బంధువుల నుంచి రూ.1.5కోట్ల వరకు అప్పులు చేసినట్లు సమాచారం.

చిట్టీల నిర్వహణ పేరుతోనూ..

అదేవిధంగా సత్యనారాయణ కొంతకాలంగా నిర్వహిస్తున్న చిట్టీల వ్యాపారంలో సైతం రూ.6లక్షల వరకు గ్రామస్తులకు బాకీ ఉన్నట్లు తెలుస్తుంది. ఈ విధంగా ముందస్తు వ్యూహంతో గ్రామస్తుల నుంచి భారీగా డబ్బులు తీసుకొని పది రోజులుగా కనిపించకుండా పోయాడు. గ్రామస్తులకు అనుమానం వచ్చి సత్యనారాయణను ఫోన్‌లో సంప్రదించేందుకు ప్రయత్నించినప్పటికీ ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో చేసేది లేక హైదరాబాద్‌లో ఉంటున్న అతని ఇద్దరు కుమారులను సంప్రదించారు. వారు సైతం తమకు ఏమీ సంబంధంలేదని చెప్పడంతో బాధితులంతా జి.కొండూరు పోలీసుస్టేషన్‌కు చేరారు. పోలీసులు బాధితుల వివరాలను నమోదు చేసుకొని విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ కూలీనాలీ చేసుకొని రూపాయి రూపాయి కూడబెట్టుకొని నమ్మకస్తుడని సత్యనారాయణకు అప్పు ఇస్తే, తమను మోసం చేసి కనిపించకుండా పోయాడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులే తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

లోక్‌అదాలత్ తీర్పులు సుప్రీంకోర్టు తీర్పుతో సమానం

15వ అదనపు జిల్లా జడ్జి ఏ.నాగశైలజ



లోక్‌అదాలత్‌లో మాట్లాడుతున్న 15వ అదనపు జిల్లా జడ్జి ఏ నాగశైలజ

నూజివీడు: లోక్‌అదాలత్‌లో ఇచ్చే తీర్పులు సుప్రీంకోర్టు తీర్పుతో సమానమని 15వ అదనపు జిల్లా జడ్జి ఏ నాగశైలజ పేర్కొన్నారు. పట్టణంలోని కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్‌అదాలత్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ కక్షిదారులు ఆవేశంలో చేసిన తప్పులకు ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరుగుతూ ఆర్థికంగా ఇబ్బందులు పడటమే కాకుండా సమయం కూడా వృథా అవుతోందన్నారు. ఈ నేపథ్యంలో కోర్టుల్లో పేరుకుపోతున్న పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు ఈ లోక్‌అదాలత్‌లు దోహదపడతాయన్నారు. లోక్‌అదాలత్‌లో మొత్తం 918 కేసులను పరిష్కరించి రూ.2,02,72,867లను సెటిల్ చేశారు. లోక్‌అదాలత్‌లో సీనియర్ సివిల్ జడ్జి షేక్ పెదఖాసిం, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.శివపార్వతి, ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఓ.అనూష, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం.శ్రావణి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మన్నం రమేష్, పలువురు సీనియర్, జూనియర్ న్యాయవాదులు, కోర్టు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మైలవరంలో 93 కేసులు పరిష్కారం..

మైలవరం: మైలవరం కోర్టు పరిధిలో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 93 కేసులు పరిష్కరించినట్లు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ఇన్‌చార్జి జడ్జి ఓ.అనూష తెలిపారు. రాజీ పడటానికి అవకాశం ఉన్న కేసులు రాజీ చేసుకుని తద్వారా విలువైన సమయం, డబ్బు ఆదా చేసుకోవచ్చన్నారు. ప్రస్తుత ఇన్‌చార్జి జడ్జి నూజివీడు మొదటి అదనపు సివిల్ జడ్జిగా ఉన్నారు.

పాస్ పుస్తకాలు ఇవ్వాలంటూ ఆందోళన



మూలపాడు పీఏసీఎస్ ఎదుట నేలపై పడుకుని ఆందోళన చేస్తున్న రైతు

మూలపాడు(ఇబ్రహీంపట్నం): పీఏసీఎస్ నుంచి తీసుకున్న రుణాలు చెల్లించినప్పటికీ సొసైటీ అధికారులు తమకు పట్టాదార్ పాస్‌పుస్తకాలు ఇవ్వకుండా ఇబ్బందిపెడుతున్నారంటూ మూలపాడు గ్రామానికి చెందిన రైతులు పీఏసీఎస్ వద్ద శనివారం ఆందోళన చేశారు. గతంలో వ్యవసాయం, ఇతర అవసరాలకు పట్టాదార్ పాస్‌పుస్తకాలు తనఖా పెట్టి రుణాలు తీసుకున్నామని, అవి పూర్తిగా చెల్లించి నోడ్యూస్ (బాకీలేదు) సర్టిఫికెట్లు తీసుకుని నెలలు గడుస్తున్నా పాస్ పుస్తకాలు మాత్రాం తిరిగి ఇవ్వడం లేదని ఆరోపించారు. బాకీ చెల్లించని సమయంలో ఇళ్లు వేలం వేయడానికి వచ్చిన అధికారులు బాకీ తీర్చిన తర్వాత పట్టాదార్ పాస్ పుస్తకాలు ఎందుకు ఇవ్వరని అధికారులను నిలదీశారు. పట్టాదార్ పుస్తకాలు అడిగితే పొంతన లేని సమాధానం అధికారులు చెబుతున్నారని రైతులు ఆవేదన చెందారు. ఈనేపథ్యంలో పోలీసులు జోక్యం చేసుకుని రైతులకు సర్దిజెప్పి వారిచే ఆందోళన విరమింపజేశారు.

హామీల అమలులో చంద్రబాబు విఫలం



సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఆగిరిపల్లి: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా ఉపాధ్యక్షుడు పల్లగాని నరసింహారావు విమర్శించారు. బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమం ఆదివారం నూజివీడు ద్వారకా ఎస్టేట్లో మాజీఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఆధ్వర్యంలో నిర్వహించనున్న సందర్భంగా ఆపార్టీ మండల అధ్యక్షుడు బెజవాడ రాంబాబు అధ్యక్షతన మండలంలోని పార్టీ నాయకులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలకు వివరించాలని నాయకులకు సూచించారు. నూజివీడులో ఆదివారం జరిగే చంద్రబాబు రీకాలింగ్ మేనిఫెస్టో కార్యక్రమానికి మండలంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొవాలని పిలుపునిచ్చారు. అనంతరం మండలానికి చెందిన పలువురు పార్టీ నాయకులకు నియోజకవర్గ స్థాయిలో పదవులు వచ్చిన సందర్భంగా వారిని సన్మానించారు. నూజివీడు నియోజకవర్గం వైఎస్సార్ మహిళా విభాగ అధ్యక్షురాలు తులిమిల్లి పావనజ్యోతి కుమారి, రైతువిభాగం అధ్యక్షుడు ఈలప్రోలు సుబ్బయ్య, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు గుర్రం శ్రీనివాసరావు, నూజివీడు నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ వాకా సక్కేశ్వరరావును ఘనంగా సత్కరించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ మచ్చా హరి బాబు, జెడ్పీటీసీ పిన్నిబోయిన వీరబాబు, సర్పంచ్‌లు అత్తి మురళి, పల్లగాని జమదగ్ని, రాఘవరపు సురేష్, సంజీవరావు, వేము రాజు, కందుల విక్రమ్, ఎంపీటీసీ సాదం గోపి, నాగుల్ మీరా, నాయకులు నండూరు భాస్కర్ ప్రసాద్, నక్కన బోయిన శ్రీమన్నారాయణ, రవిశేఖర్, నేరుసు రాజేష్, చిమట శ్రీనివాసరావు, మైనార్టీ నాయకులు ఎస్‌కే సుభాని, బాషా, హనుమంతరావు, ప్రదీప్ పాల్గొన్నారు.

వైభవంగా జగన్నాథ రథయాత్ర



రథయాత్రలో భక్తుల కోలాట ప్రదర్శన

భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి గ్రామంలోని కరకట్ట డౌన్‌లో వేంచేసి ఉన్న శ్రీజగన్నాథ మందిరం అధ్యక్షులు శ్రీమాన్ దయానిధి ప్రభు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జగన్నాథ రథయాత్ర అత్యంత వైభవంగా జరిగింది. మధ్యాహ్నం 2 గంటలకు స్థానిక అయ్యప్పఘాట్ నుంచి ప్రారంభమైన ఈ రథయాత్ర అయ్యప్ప స్వామి దేవాలయం ప్రాంగణంలోని ఫంక్షన్ హాల్ వద్దకు చేరుకుంది. హరేకృష్ణ భక్త బృందం గానం చేసిన సంకీర్తనలు, భజనలు, కోలాటం, నృత్య ప్రదర్శనలతో సాగిన ఈ రథయాత్రలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఫంక్షన్ హాల్ వద్ద హరేకృష్ణ స్వామీజీలు ప్రవచనాలు చేశారు. కార్యక్రమానికి గ్రామపెద్దలు బొమ్మసాని సుబ్బారావు, నల్లా వాసు, బొర్రా తిరుపతిరావు తదితరులు హాజరయ్యారు.

వాడీవేడిగా సాగిన సర్వసభ్య సమావేశం

ముసునూరు: ప్రజాసమస్యలు, ప్రజాప్రతినిధుల విషయంలో అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని సర్వసభ్య సమావేశంలో నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీపీ కొండా దుర్గాభవాని అధ్యక్షతన శనివారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ, వైస్ ఎంపీపీలు రాజానాయన, గంగాధర్, జెడ్పీటీసీ డాక్టర్ వరికూటి ప్రతాప్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధుల పట్ల అధికారులు, హైస్కూల్ హెచ్‌ఎంలు వ్యవహరిస్తున్న తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారిక కార్యక్రమాలకు ప్రజాప్రతినిధులకు సమాచారం అందించడంలేదని తీవ్రంగా ధ్వజమెత్తారు. సమావేశంలో ఎంపీడీఓ బీఏ సత్యనారాయణ, తహసీల్దార్ రమణ, వైద్యాధికారి షకీనాఇవాంజిలిన్, ఎంఈఓ సుబ్బారావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు పెంచిన వేతనాలు ఇవ్వాలి

ఇబ్రహీంపట్నం: అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లకు పెంచిన వేతనం తక్షణం అమలు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలు హెల్పర్స్ మండల యూనియన్ ఆధ్వర్యంలో శనివారం ఇబ్రహీంపట్నంలో నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా సీఐటీయూ ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి ఎం.మహేష్ మాట్లాడుతూ పెరిగిన ధరల రీత్యా కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని, సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరారు. 9న జరిగే దేశవ్యాప్త సమ్మె విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు కె.బుల్లిమ్మ, కార్యదర్శి ఎస్.నిర్మల, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం



జి.కొండూరు(మైలవరం): జి.కొండూరు గ్రామంలోని కేడీసీసీ బ్యాంకు ఎదురుగా ఉన్న రోడ్డును రూ.3లక్షలు మండల పరిషత్ నిధులతో సీసీ రోడ్డుగా అభివృద్ధి చేస్తూ చేపట్టిన పనులను ఎంపీపీ వేములకొండ లక్ష్మీ తిరుపతమ్మ, సర్పంచ్ మండల అరుణ శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఏఈ సాంబశివరావు, కేడీసీసీ బ్యాంకు మాజీ వైస్ చైర్మన్ వేములకొండ రాంబాబు, వేములకొండ సాంబశివరావు, వేములకొండ నవీన్‌కుమార్, గ్రామ పార్టీ అధ్యక్షుడు వేములకొండ విష్ణు, ఉండ్రకొండ నాగరాజు, ఖాజావలి పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహుని కల్యాణం



ఆగిరిపల్లి: స్థానిక శ్రీశోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరసింహుని ఆలయంలో శనివారం స్వామివారి జన్మనక్షత్రం స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని కొండపై ఉన్న ఎగువ సన్నిధిలో మూలవిరాట్‌కు స్నపన, విశేష అలంకరణ, సహస్రనామార్చనలు నిర్వహించారు. దిగువ సన్నిధిలో స్వామివార్లకు మూలమంత్రం కల్యాణ మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు వేదాంతం శేషుబాబు, అనంతకృష్ణ, బాలాజీ పూజా కార్యక్రమలను నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

తిరువూరు: టైలర్స్ యూనియన్ తిరువూరు పట్టణ కమిటీ కొత్త కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్ష కార్యదర్శులుగా కోట శాంతకుమారి, ఇంజం రాజేశ్వరి, గౌరవాధ్యక్షులుగా షేక్ సత్తార్, 10మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. టైలరింగ్ వృత్తిపై ఆధారపడి జీవించేవారికి ప్రభుత్వపరంగా ప్రోత్సాహాన్ని అందించాలని, 50 ఏళ్లు దాటిన టైలర్లకు పింఛను మంజూరు చేయాలని, ప్రభుత్వం మంజూరు చేసే అన్ని సంక్షేమ పథకాలూ వర్తింపజేయాలని వారు కోరారు. సీఐటీయూ నాయకులు వెంకటేశ్వరరావు, తులసీ రాణి, పంతంగి శ్రీనివాసరావు, ఎస్‌వీ భద్రం తదితరులు పాల్గొన్నారు.

26 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



నూజివీడు: మండలంలోని మొర్సపూడిలో అక్రమంగా తరలిస్తున్న 26క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అధికారులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. అక్రమార్కులు ఓ వాహనంలో రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా, సివిల్ సప్లయ్స్ డీటీ జీ వెంకటేశ్వరరావు ఈ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

నేడు వైఎస్సార్ సీపీ సమావేశాలు

తిరువూరు: తిరువూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమావేశాన్ని ఆదివారం మధ్యాహ్నం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు తెలిపారు. తిరువూరు మండలం లక్ష్మీపురంలోని మనో గార్డెన్స్ ఆవరణలో మధ్యాహ్నం 3గంటలకు జరిగే సమావేశంలో 'బాబు షూరిటీ–మోసం గ్యారంటీ' కార్యక్రమ నిర్వహణపై నాయకులు, కార్యకర్తలకు అవగాహన కల్పించనున్నట్లు వివరించారు. సమావేశానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, విజయవాడ పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకుడు మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. నియోజకవర్గ ముఖ్య నాయకులు, అనుబంధ విభాగ బాధ్యులు హాజరుకావాలని ఆయన కోరారు.

ఇబ్రహీంపట్నంలో...

ఇబ్రహీంపట్నం: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఇబ్రహీంపట్నంలో మాజీమంత్రి జోగి రమేష్ అధ్యక్షతన ఆదివారం సాయంత్రం 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ'(రీకాలింగ్ బాబూస్ మేనిఫెస్టో) సదస్సునిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు నల్లమోతు దయాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొంటారన్నారు. పార్టీకి చెందిన అన్ని విభాగాల నాయకులు హాజరుకావాలని కోరారు.

నూజివీడులో...

నూజివీడు: వైఎస్సార్‌సీపీ నూజివీడు నియోజకవర్గ స్థాయి విస్తృత స్థాయి సమావేశాన్ని ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు పట్టణంలోని ద్వారకా ఎస్టేట్‌లో నిర్వహిస్తున్నట్లు మాజీఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు శనివారం తెలిపారు. రీకాలింగ్ చంద్రబాబూ మేనిఫేస్టోపై పెద్దఎత్తున ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు నిర్వహిస్తున్న ఈ సమావేశంలో జిల్లాకు చెందిన పలువురు నాయకులు, మాజీ ఎమ్మెల్యేలు పాల్గొంటారన్నారు. నియోజకవర్గంలోని పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సానుభూతిపరులు పాల్గొనాలని కోరారు.

ఆర్టీసీ కార్మికులపై వేధింపులు ఆపాలని డిమాండ్



నూజివీడు ఆర్టీసీ డిపో గేట్ వద్ద ధర్నా చేస్తున్న యూనియన్ నాయకులు, కార్మికులు

నూజివీడు: ఆరేళ్లుగా పెండింగ్‌లో ఉన్న పదోన్నతలను వెంటనే చేపట్టాలని ఎంప్లాయీస్ యూనియన్ రీజనల్ నాయకుడు రంగు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలపై ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో రెండో రోజైన శనివారం స్థానిక ఆర్టీసీ డిపో గేట్ వద్ద కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెడింగ్‌లో ఉన్న డీఏ బకాయిలను విడుదల చేయాలని, ఆర్టీసీ కార్మికులపై ప్రతి చిన్నదానికి పనిష్మెంట్ పేరుతో చేపడుతున్న వేధింపులను వెంటనే ఆపాలని కోరారు. రిటైర్ అయిన ఉద్యోగులకు, చనిపోయిన ఉద్యోగులకు చెల్లించాల్సిన గ్రాడ్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ నగదును సంవత్సరాలు గడుస్తున్నా చెల్లించకపోవడం దారుణమన్నారు. కారుణ్య నియామకాలు వెంటనే చేపట్టి ఆయా కుటుంబాలను ఆదుకోవాలన్నారు. ఆర్టీసీ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను ఆప్కాస్ చేర్చడంతో పాటు కాంట్రాక్టు కండక్టర్లు, డ్రైవర్లను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. న్యాయమైన డిమాండ్ల సాధనకు ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో రాజీలేని పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ డిపో అధ్యక్షుడు ఎం చిరంజీవి, కార్యదర్శి ఈ విజయ్ కుమార్, నాయకులు పీ శ్రీనివాసరావు, ఎంఎస్ కుమార్, పీ సత్య చంద్రరావు, ఏ సతీష్, వై రమేష్, బీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలి



మాట్లాడుతున్న సీఐ దాడి చంద్రశేఖర్

మైలవరం: దేవాలయాలు, మసీదులు, క్రీస్తు దేవాలయాల వద్ద సీసీ కేమేరాల ఏర్పాటుకు మతపెద్దలు సహకరించాలని మైలవరం సీఐ దాడి చంద్రశేఖర్ కోరారు. దాతల సహకారంతో మైలవరం గ్రామంలో పోలీస్ స్టేషన్ పరిధిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో స్థానిక సీఎమ్ఆర్ ఫంక్షన్ హాల్‌లో మతపెద్దలు, గ్రామ పెద్దలతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు.

సీఐ మాట్లాడుతూ గ్రామంలో దొంగతనాలు నివారణకు తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ముఖ్యంగా డివైన్ సురక్ష కార్యక్రమంలో దేవాలయాలు, మసీదులు, క్రీస్తు దేవాలయాల వద్ద భాగంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నేరస్తులను పట్టుకోవడంలో సీసీ కెమెరాలు ఎంతో కీలకంగా మారాయని వివరించారు. ఎస్సై సుధాకర్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్యాయత్నం

పోలీసుల వేధింపులే కారణమంటున్న బంధువులు

ఇబ్రహీంపట్నం: భార్యాభర్తల గొడవలో తలదూర్చిన పోలీసులు భర్తను దుర్భాషలాడి వేధించడంతో అతను మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి శుక్రవారం రాత్రి ఆత్మహత్యాప్రయత్నం చేశాడు. అపస్మారక స్థితిలోకి చేరిన బాధితుడిని బంధువులు మంగళగిరి ఎయిమ్స్ వైద్యశాలకు తరలించారు. సేకరించిన వివరాల మేరకు... స్థానిక ఫెర్రీకి చెందిన వేముల గోపీచంద్, భార్య మేరీహారిక మధ్య మనస్పర్థలు తలెత్తాయి. ఈవిషయంలో జోక్యం చేసుకున్న భార్య తరపు బంధువులు గోపీచంద్‌పై దాడిచేశారు. పోలీసుస్టేషన్‌లో పిర్యాదు చేసేందుకు వెళ్లిన గోపీచంద్ ఫిర్యాదు స్వీకరించని పోలీసులు, అతని భార్య మేరీహారిక ఫిర్యాదును మాత్రం స్వీకరించి బాధితుడిని నానా దుర్భాషలాడారు. దీంతో మనస్తాపం చెందిన గోపీచంద్ పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. విషయం తెలుసుకున్న బంధువులు అతన్ని మంగళగిరి ఎయిమ్స్ వైద్యశాలకు తరలించగా, వైద్యులు చికిత్స అందిస్తున్నారు. బాధితుడు గోపిచంద్‌ను వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి వేముల బేబీరాణి పరామర్శించారు. గోపిచంద్‌పై దాడిచేసిన వారిపై ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. న్యాయం కోసం వచ్చిన బాధితుడిని దుర్భాషలాడిన ఎస్ఐ ఫణీంద్ర, ఏఎస్ఐ సువర్ణబాబుపై చర్యలు తీసుకోవాలని సీఐ చంద్రశేఖర్‌ను కోరారు.

సంక్షిప్త వార్తలు

■ ఆధ్యాత్మిక కార్యక్రమాలు

తిరువూరు: ఆషాఢమాస సందర్భంగా శనివారం తిరువూరులోని పలు దేవాలయాల్లో శనివారం విశేషపూజలు నిర్వహించారు. కోదండరామాలయంలో పెరియాళ్వార్ తిరునక్షత్రాన్ని పురస్కరించుకుని విశేషపూజలు జరిపారు.

■ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు తగదు : సీపీఐ

తిరువూరు: స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ తిరువూరులో సీపీఐ ఆధ్వర్యంలో శనివారం ప్రదర్శన, ధర్నా చేశారు. పార్టీ నాయకులు తూము కృష్ణయ్య, చిలుకూరి వెంకటేశ్వరరావు, మాలపాటి ఉదయ్, సుభాని, అశోక్ పాల్గొన్నారు.

■ విజేతలకు ప్రశంసాపత్రాల అందజేత

ఆగిరిపల్లి: రాష్ట్రస్థాయి యోగాంధ్ర పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన మండలానికి చెందిన విద్యార్థులను స్థానిక హోమియో వైద్యశాలలో తహసీల్దార్ పీఎస్‌వీ ప్రసాద్ శనివారం ఘనంగా సత్కరించారు. డిప్యూటీ ఎంపీడీవో ఆనంద్ కుమార్, హోమియో వైద్యురాలు రజిత, సర్పంచ్ చవటపల్లి లక్ష్మి, హెచ్‌ఎం యామిని, యండూరి ప్రణీత్, యోగా గురువులు సాంబశివరావు, పాల్గొన్నారు.

■ వంతెన నిర్మాణం కోరుతూ ధర్నా



తిరువూరు: గంపలగూడెం మండలం వినగడప వద్ద కట్టలేరుపై వరదలకు కొట్టుకుపోయిన వంతెన స్థానంలో నూతన హైలెవెల్ వంతెన నిర్మించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో శనివారం కట్టలేరు వద్ద ధర్నా చేశారు. సీపీఎం మండల కార్యదర్శి వెంకటరెడ్డి, మేకల నాగేంద్రప్రసాద్, గువ్వల సీతారామిరెడ్డి, ఆనందరావు, గోపి, వీరభద్రం, కుటుంబరావు పాల్గొన్నారు.

సాయిబాబా మందిర వార్షికోత్సవం



ఆగిరిపల్లి: స్థానిక సింగన్నగూడెం బస్‌స్టాప్ వద్దగల సర్వ కార్యసిద్ధి షిరిడీ సాయిబాబా ధ్యాన మందిరం 18వ వార్షిక వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. బాబావారికి కాగడ హారతి, విశేష ఫలమృతాలతో అభిషేకం, సహస్రనామార్చన, పూజా కార్యక్రమాలనును ఆలయ అర్చకులు దేవులపల్లి నరసింహమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం సర్వ కార్యసిద్ధి షిరిడీ సాయిబాబా ట్రస్ట్, భక్తుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని తహసీల్దార్ పీఎస్వీ ప్రసాద్ ప్రారంభించారు. 8వేల మందికి అన్నదానం చేశారు.

ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం మార్పు

తిరువూరు: తిరువూరులోని సమగ్ర స్త్రీ శిశు అభివృద్ధి పథకం కార్యాలయాన్ని మార్పు చేసినట్లు సీడీపీవో కృష్ణకుమారి శనివారం తెలిపారు. ప్రస్తుతం శాంతినగర్లో ఉన్న ఈ కార్యాలయాన్ని జంట సినిమాహాళ్ల ఎదురుగా ఉన్న ప్రైవేటు భవనంలోకి మార్పు చేసినట్లు వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని సీడీపీవో కోరారు.